క్లుప్తంగా

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్

కాచిగూడ: డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. శనివారం కాచిగూడ డివిజన్ బసంత్‌కాలనీ, ఇందిరానగర్ బస్తీ, కాశీరాంజీరా తదితర ప్రాంతాల్లో చేపడుతున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక బస్తీల్లో పర్యటించి ప్రజలు ఎదర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నేతలు కన్నెరమేష్‌యాదవ్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, చేతన్, మనోజ్, ఆర్.సంతోష్, రాజ్‌కుమార్, సూరి తదితరులు పాల్గొన్నారు.

నిత్య జనగణమనను విస్తరింపజేయాలి



జీహెచ్‌ఎంసీ సర్కిల్-6 ఏఎంఓహెచ్ జ్యోతిబాయి

నల్లకుంట: నిత్య జనగణమనను వాడవాడకు విస్తరింపచేయడానికి దేశభక్తి కలిగిన ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్-6 ఏఎంఓహెచ్ డాక్టర్ జ్యోతిబాయి కోరారు. శివానందనగర్‌లో శనివారం నిత్య జనగణమన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. నిర్వాహకులు మధు, క్రాంతి, ప్రశాంత్, శ్రీనివాస్, ప్రసాద్ దూబే, విజయేందర్ రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి



బుద్ధుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ప్రతినిధులు

నల్లకుంట: ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. నిస్వార్థంగా సేవా కార్యక్రమాలు చేపట్టే వారికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. నల్లకుంట డివిజన్ శివానంద్‌నగర్‌లో నిత్యజనగణమన నిర్వాహకుల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సాయి సేవా సమాజ్ సంస్థ కార్యాలయాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. సంస్థ సభ్యులు నేలంటి మధు, మల్లాడి క్రాంతి, నూతి శ్రీకాంత్, సర్వు అశోక్, ఎంకే.శ్రీనివాస్, విజయేందర్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



రాంనగర్ చౌరస్తాలో స్వీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్



సంబరాల్లో పాల్గొన్న పాకజ్ఞానేశ్వరిప్రసాద్, సునీతారావు

ముషీరాబాద్: కర్ణాటక రాష్ట్ర ఫలితాలు త్వరలో జరగబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పునరావృతం అవుతాయని కాంగ్రెస్‌పార్టీ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎం.అనిల్ కుమార్ యాదవ్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి నగేష్ ముదిరాజ్‌లు స్పష్టం చేశారు. కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై రాంనగర్ చౌరస్తాలో అనిల్‌కుమార్ యాదవ్, నగేష్ ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో వేర్వేరుగా సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా దుకాణదారులు, ప్రయాణికులకు మిఠాయిలు పంచిపెట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న నియంతృత్వ ధోరణికి ప్రజలు త్వరలోనే చరమగీతం పాడుతారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కల్పనాయాదవ్, పాశం అనిల్‌కుమార్, కెనడీలతో పాటు పలువులు నేతలున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వమే..

చిక్కడపల్లి: తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వర్ ప్రసాద్ అన్నారు. శనివారం గాంధీనగర్ డివిజన్ నుంచి పెద్ద ఎత్తున సునీతారావుతో పాటు మహిళ కార్యకర్తలు తరలివెళ్లారు.

ప్రభుత్వ పథకాల్లో మున్నూరు కాపులకు ప్రాధాన్యమివ్వాలి



రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు

కాచిగూడ: పేదరికంలో ఉన్న మున్నూరు కాపులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కాచిగూడలోని మున్నూరుకాపు మహాసభ కార్యాలయంలో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఇష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనికి అవసరమైన సహాయ, సహకారాలను మహాసభ అందిస్తుందన్నారు. మహాసభ ప్రతినిధులు హజారీ రామ్మోహన్, వినోద్‌కుమార్, నేమదాది సత్యేందర్, రవికాంత్, ప్రహ్లాద్, రమేష్, శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే పాదయాత్రలు



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: ప్రజా సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కార చర్యలు చేపట్టేందుకే నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పాదయాత్రలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శనివారం నల్లకుంట డివిజన్ కళావతిలేన్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర చేపట్టగా.. స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా గుంతల మయంగా మారిన సీసీ రోడ్డు నిర్మాణాలను చేపట్టాలన్నారు. తాగునీటి పైప్‌లైను వేయించాలని వెలగని వీధిలైట్లు, పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తదితర ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జలమండలి, జీహెచ్‌ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసి సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

'ఎన్నికల్లో డబ్బులు వెదజల్లని పార్టీ ఆప్'



ఆప్‌లోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ దిడ్డి సుధాకర్, శ్రీకాంత్, శోభన్‌లు

కవాడిగూడ: దేశవ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల్లో డబ్బులు వెదజల్లకుండా నిజాయితీగా పోరాడి గెలిచే ఏకైక పార్టీ ఆమ్‌ఆద్మీపార్టీ మాత్రమేనని ఆ పార్టీ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్, గుర్రా రాముగౌడ్, భూక్యా శోభన్‌లు వెల్లడించారు. నగరంలోని వివిధ పార్టీల నుంచి నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో శనివారం దోమలగూడలోని ఆప్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కోర్ కమిటీ సభ్యుల సమక్షంలో పార్టీ కండువాను కప్పుకున్నారు. వీరిని ఆమ్ ఆద్మీపార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతించారు. వారు మాట్లాడుతూ.. పార్టీ భావాజాలం నిజాయితీ, దేశభక్తి, మానవత్వాన్ని చూసి పలు పార్టీల నుంచి ఆప్‌లోకి రావడం అభినందనీయమన్నారు. ఎన్నికల్లో డబ్బులు వెదజల్లకుండా ప్రజల ఆమోదాన్ని పొందవచ్చని ఆమ్ ఆద్మీపార్టీ స్పష్టంగా నిరూపించిందన్నారు. బీఎస్‌పీ రాష్ట్ర మాజీ కార్యదర్శి శ్రీకాంత్, సినీ నిర్మాత రాజీవ్, బీసీ సంఘ నాయకులు వడ్డెర నర్సన్న, ఏబీవీపీ నాయకులు కరుణాకర్‌లు ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. ఆప్ రాష్ట్ర నాయకులు డాక్టర్ పుష్ప, సయ్యద్, గఫ్పర్, రణదీప్‌సింగ్ రాణా, ప్రవీణ్‌కుమార్ యాదవ్, వీక్షణ్, వేణు, రాకేష్‌సింగ్ తదితరులున్నారు.

యువకుడి అదృశ్యం

ఈనెల 15న యువకుడి వివాహం..

అంబర్‌పేట: పెళ్లికి రెండురోజుల ముందు పెళ్లి కుమారుడు అదృశ్యమైన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాకలో నివాసం ఉండే పార్వతి హనుమంతరావు దంపతులకు ఓ కుమారుడు సునీల్ (29), ఓ కుమార్తె ఉన్నారు. సునీల్ నాచారంలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. అతడికి జుక్కల్‌కు చెందిన ఓ అమ్మాయితో వివాహ నిశ్చితార్థం జరగగా.. ఈ నెల 15న పెళ్లి నిశ్చయమైంది. పెళ్లి పనుల కోసం సునీల్ కుటుంబ సభ్యులు గత నెల 20న స్వగ్రామం పెద్దదొడ్డికి వెళ్లారు. సునీల్ ఈ నెల 11న ఊరికి వస్తానని చెప్పి ఈనెల 12 వరకు తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన ఆయన తల్లి పార్వతి శనివారం గోల్నాకలోని ఇంటికి వచ్చి చూడగా.. ఇంటికి తాళం ఉంది. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన ఆమె అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నగరంలో ప్రసిద్ధిగాంచిన చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో గతవారం రోజులుగా జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. స్వామివారిని ఎమ్మెల్యే ముఠా గోపాల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, బిందె తీర్థం, బాలభోగం, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహణ అధికారి కె.రామాంజనేయులు, ఆలయ వ్యవస్థాపక వంశీయుడి కుమారుడు శ్రీనాథ్‌గౌడ్ దంపతులు పాల్గొన్నారు.

హర్యానా గవర్నర్ దత్తాత్రేయకు ఆహ్వానం



దత్తాత్రేయను ఆహ్వానిస్తున్న మల్లికార్జున్‌గౌడ్ కుటుంబసభ్యులు

కవాడిగూడ: మాజీ కేంద్రమంత్రి మల్లికార్జున్‌గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను ఆహ్వానించారు. ఈ మేరకు ఛండీఘర్‌లోని రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మల్లికార్జున్ విగ్రహాన్ని శంషాబాద్ సమీపంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ నెలాఖరులో విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి దత్తాత్రేయతో పాటు వివిధ పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నట్లు కుటుంబసభ్యులు వివరించారు.

ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేయాలి



స్వామివారిని దర్శించుకున్న మంత్రి తలసాని, నూతన ధర్మకర్తలు

రాంగోపాల్‌పేట్: ఎస్పీరోడ్డు వీర హనుమాన్ దేవాలయ అభివృద్ధికి నూతన ధర్మకర్తల మండలి సభ్యులు మరింత కృషి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. శనివారం సికింద్రాబాద్ ఎస్పీరోడ్డు వీర హనుమాన్ దేవాలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ఎప్పటికప్పుడు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ఎంతో అభివృద్ధి చేసి చరిత్రలో నిలిచిపోయేలా చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి నిరంతరం తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. బల్కంపేట ఎల్లమ్మ, ఉజ్జయినీ మహంకాళి, సికింద్రాబాద్ గణపతి దేవాలయం, అమీర్‌పేట్ కనకదుర్గ ఆలయాలను ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించామని వివరించారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కృష్ణ నూతన కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, ఈఓ శ్రీనివాస్‌శర్మ, నాయకులు శ్రీనివాస్‌గౌడ్ శ్రీహరి, శేఖర్ పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి

చిక్కడపల్లి: అసంఘటితరంగ కార్మికులందరూ తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కార్మికశాఖ అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్ సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసంఘటిత కార్మికుల కోసం ఇచ్చే అన్ని సదుపాయాలు చేకూరుతాయని వివరించారు. కార్మికులు తమ పేర్లను ఈ -శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని ప్రయోజనం పొందాలన్నారు. తమ సమీప ప్రాంతాల్లోని గ్రామ, వార్డు, డివిజన్, సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)లో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు.

16న ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ టెస్ట్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మహిళలకు ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ టెస్టును నిర్వహిస్తున్నట్లు వాకర్స్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్ రెడ్డి, నిరంజన్ రెడ్డిలు తెలిపారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి సహకారంతో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో క్యాంపును నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. సుందరయ్య పార్కులో ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పేర్లను నమోదు చేసుకునేందుకు 9391331908, 9848153534ను సంప్రదించాలన్నారు.

'ప్రత్యక్ష దైవం అమ్మ'

కాచిగూడ: అమ్మ ప్రేమలోనే అమృతం ఉంటుందని పౌరసరఫరాల శాఖ ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తాహసీల్దార్, తెలంగాణ పద్మశాలీ అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మాచన రఘునందన్ అన్నారు. ప్రతి ఏటా మే రెండో ఆదివారాన్ని వరల్డ్ మదర్స్‌డేగా నిర్వహించుకోవడం పరిపాటి అని అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన తల్లి విజయ ఆశీర్వాదం తీసుకున్నారు.